

# ఆపదలో "ఆనందం"

ఆనందరావు ఆఫీసులో అడుగు పెట్టాడంటే ఆనందం నాట్యం చేసినట్లే!

ఎలాటి సీరియస్ మాటల్నీ అతని ఛలోక్తులతో, చమక్కులతో తేలిక చేసేస్తాడు. చివరకు ఆఫీసరు కూడా ఏదయినా డీప్ డిష్కసన్స్ చేసేటప్పుడు "ఓయ్ ఆనందూ! నువ్వో అరగంట నీ సీట్లో కూర్చో వేం అర్జంటుగా చేయాల్సిన పనుల గురించి ఆలోచిస్తున్నాం" అంటాడే గానీ - ఒక్కసారైనా సున్నితంగా నైనా మందలించడు. అసలు మందలించటానికీ అతను అవకాశం ఇస్తే కదా?

అలాంటి ఆనందరావు ఈమధ్య బాగా డల్‌గా ఉంటున్నాడు.

ఒక జోక్ వెయ్యటం లేదు. ఒక చిరునవ్వు రాల్చటం లేదు. ఒక చమక్కు విసరటం లేదు. పైగా పలకరించినా తనని కానట్టే తప్పు కుటున్నాడు. సీట్లో కూర్చున్న దగ్గర్నుంచి పన్లో లీనమైపోవటమో, లేదా పెన్ను పెదాలమీద పెట్టుకుని ఏదో తీక్షణమైన ఆలోచనలో పడిపోవటమో చేస్తున్నాడు.

ఉదయమో డ్రెస్సూ, మధ్యాహ్నమో డ్రెస్సూ మార్చేవాడు. చల్లని మనసుని మరులు గొలిపే ఫెర్‌ఫ్యూమ్‌తో అతనొచ్చేసరికి - వస్తున్నది 'ఆనందరావే' నని అతను గదిలోకి ఎంటరవకపోయినా తెలిసిపోయేది; ఎప్పుడూ టక్ చేసుకుని వచ్చేవాడు. యాభైకి దగ్గరవుతున్నా ముప్పయిగా కనిపించేవాడు.

అలాటి ఆనందరావు ఇప్పుడు టక్ చేయటం పూర్తిగా మానేసాడు. రెండు, మూడు రోజులయినా డ్రెస్సు మార్చుకోవటం లేదు. గడ్డం అక్కడ అక్కడా పండి 'బియ్యం - నల్లనూలూ' కలిసినట్లు అనహ్యాంగా కనిపిస్తోంది వారం రోజులయినా షేవ్ చేసుకోకపోవటం వల్ల!

ఏమడిగినా సమాధానం చెప్పడు.

ఎంత కదిపినా తొణకటం లేదు.

పైగా-

కొద్దిరోజులుగా ఓ అరవై యేళ్ళ ముసలాడు అతనితో కూడా వస్తున్నాడు. ఆనందరావు ఏ పని మీదైనా సీట్లోంచి లేస్తే

స్ప్రింగ్ తొక్కినట్లు ఆ ముసలాయన కూడా లేస్తున్నాడు. 'కూర్చోండి నాకేం కాలేదు' అని ఆనందరావు రెండు మూడుసార్లు కేకలేయటం పక్క సీట్లో వాళ్ళు కనిపెట్టకపోలేదు. ఆ ముసలాయన మాత్రం "ఏం కావాలో చెప్ప బాబూ! నేనున్నాగా!" అనేవాడు.

ఒకరిద్దరు ముసలాయన్ని "మీరెవరూ? మా ఆనందు వెనకాలే రావటానికి కారణమేంటీ?" అనడిగితే అతనూ సమాధానాన్ని చిరునవ్వుతోనే సరి పెట్టేవాడు.

ఈ మిస్టరీ ఏంటో ఆఫీసులో ఎవరికీ అర్థం కాలేదు.

ఓసారి హెడ్ గుమస్తా బాస్ పిలిస్తే వెళ్ళాడు. వెళ్ళిన పని అయిపోయినా అక్కడే నిలబడ్డం గమనించిన బాస్ "ఏంటి? చెప్పండి - సెలవు కావాలా?" అడిగాడు.

"అది కాద్సార్. ఓ డౌటు...."

"చెప్పండి....?"

ఈ మధ్య మన ఆనందం చాలా మూడీగా మారిపోయాడు. ఎప్పుడూ గలగలలాడే వ్యక్తి నిర్లిప్తంగా ఉంటున్నాడు. పైగా ఈ మధ్య అతనితో ఆ ముసలాయన వస్తున్నాడు. ఎందుకో అర్థం కావటం లేదు. అడిగితే చెప్పట్లేదు. మీకేమన్నా తెలుసు నేమోనని...." అని నసిగాడు.

"ఓ.... అదా! చెప్పటం మరిచాను. వారం క్రితం మిసెస్ ఆనందరావు మా ఇంటి కొచ్చారు. ఆమె చెప్పేదేమంటే ఆనందరావు మెంటల్‌గా ఏదో దెబ్బతిన్నాట్ట, కారణం తెలీదు. ఎప్పుడూ ఏదో గొణుక్కుంటాట్ట. ఎటో చూస్తాట్ట. అర్ధరాత్రి లేచి ఎక్కడికో వెళ్ళిపోతూ ఉంటాట్ట. వైజాగ్ తీసుకెళ్తే పెద్దగా భయపడక్కర్లేదూ అని, ఇదో రకం మానసిక రుగ్మత అని సిగరెట్లు ఎక్కువగా తాగటం వలన, అతిగా ఆలోచించటం వలనా వస్తుందని చెప్పాడట. అతనెక్కడికీ వెళ్ళిపోకుండా... వాళ్ల పిన మామగార్ని ఆనందుతో పంపిస్తానూ... మీరు కొంచెం సహకరించండి..... అని ప్రాధేయ పడింది. మీకీ విషయం చెపుదామనుకుని.... వెధవది..... ఈఫైళ్ళలో పడి మరిచిపోయాను. మన వాళ్ళకి మెల్లగా చెప్పండి. ఆనంద్‌కి తెలీనీకండి" అన్నాడు బాస్.

కేంటీన్‌లో ఈ విషయం అతిరహస్య యంగా బట్టబయలు చేసాడు హెడ్. ఇంత వేగరం.... బలీయమైన కారణం లేకుండా ఆనందరావు మెంటల్‌గా అప్‌సెట్ కావటం అనే విషయం ఎవరికీ కొరుకుడు పళ్ళేదు.

రెండు రోజుల తరువాత హెడ్ గుమస్తా - "ఆనందూ! రావోయ్ ఛాయ్ కొట్టి వద్దాము! అనగానే ఆనందరావు వెంటనే కుర్చీలోంచి లేచాడు. ఇద్దరూ కలిసి ఉన్నట్లు ఆనందరావు లేవగానే ఆ ముసలాయనా లేచాడు.

"మీరు కూచోండి. మీకేం భయంలేదు. ఆనంద్‌ని నేను తీసుకొస్తాను. టీ పంపిస్తా... తాగండీ" అని ముసలాయన్ని కూర్చోపెట్టి ఆనందరావు భుజంమీద చెయ్యి వేసి కేంటీన్‌లోకి తీసుకెళ్ళాడు.

రెండు టీలకి ఆర్డరిచ్చాడు. రెండు మసాలాగారెలు తీసుకొని ఒకటి ఆనందుకిచ్చి. ఒకటి తాను తింటూ.... "ఆనందూ! నువ్విలా డల్‌గా కామ్‌గా ఉండిపోవటం.... అందునా మన రామావతారం మాటల్ని మిమిక్రీ చేసి మాట్లాడకపోవటం మాకెంతో లోటుగా ఉందోయ్." అన్నాడు హెడ్. రామావతారం ఆ ఆఫీసులో టైపిస్ట్. ఆతన్ది ఆడగొంతుక. నడక కూడా ఆడవాళ్ళలాగే ఉంటుంది. ఆఫీసరు పిలిచినప్పుడు ఎలా పలుకుతాడో, ఎలా వెళ్తాడో మిమిక్రీ చేస్తూ అనుకరిస్తూ ఆనందరావు అందర్ని నవ్విస్తాడు. రామావతారం బదిలీ మీద వెళ్ళి సంవత్సరం

అయినా, ఖాళీ సమయంలో అతని గొంతుని వినిపిస్తూ, అందర్ని నవ్విస్తాడు. ఆనందరావు. ఈ విషయం బాన్‌కీ తెలిసీ... అతనూ రామావతారాన్ని వినిపించమన్నాడు. అందుకే ఆనందరావుకి మూడ్ తేవాలని రామావతారం ప్రసక్తి తెచ్చాడు హెడ్డు.

"ఏంటీ గురుగారూ! నా పరిస్థితే అడకత్తెరలో పోకచెక్కయిపోయింది. ఇప్పుడా సరదాయే పోయింది" అన్నాడు. నిర్లిప్తంగా.

సర్వరు అందించిన టీలు తాగుతూ -హెడ్ గుమాస్తా సిగరెట్ పెట్టె తీసి ఆనంద్‌కి అందిచ్చాడు. "ఎన్నాళ్ళయింది? సిగరెట్ చూసి" అని టీ తాగి... సిగరెట్ అంటించాడు. గుప్పున పొగ వదిలాడు. ఆనంద్ కష్టమంతా మరిచిపోయాడు.

"ఇప్పుడు చెప్పవోయ్! అసలు జరిగిన కథేమిటీ?"

ఆనందరావు సిగిరెట్‌ని రెండు దమ్ములు గట్టిగా లాగి చెప్పటం ప్రారంభించాడు.

ం ం ం ం

స్కూటర్ మీద జోరుగా వెళ్తోన్న ఆనందరావుకి పూలకొట్టుకి వేలాడుతున్న సన్నజాజుల దండలు శోభనపు రోజును గుర్తుకు తెచ్చాయి. వారం రోజులు కేంపెళ్ళటం... అంతకు పదిరోజులు ముందు ఇంటినిండా చుట్టాలు... వీటివల్ల అనంతలక్ష్మితో కబుర్లు చెప్పటం ఆమెను అల్లరి పెట్టటం అతనికి కుదర్లేదు.

సన్నజాజుల దండలు చూసేసరికి అతని గుండెలనిండా అనంతక్ష్మి అల్లుకుంది. నలభై పైబడినా చెక్కుచెదరని అవయవ సౌష్ఠవం.... మిలమిలలాడే కళ్ళు... ఫలిత కేశం లేని వంకీలు తిరిగే జుట్టూ..... ఒక్కసారిగా ఆనందరావుని మైకం కమ్మేసింది. స్కూటర్‌ని ఆపి "ఎలాగమ్మాయ్? అన్నాడు.

"ఆఖరయిపోనాయి. నాలుగు దండలున్నాయి. ఇరవై యిచ్చేయండి,"

"ఇచ్చే భేరం చెప్పు. మొత్తం పది రూపాయలు ఇస్తాను. ఇచ్చేసెయ్."

"ఆలోసించండి బాబూ... ఒక్కో దండానాలుగు మూరలు నచ్చుండదు. బేగింటికెళ్ళి పోవాలనిగానీ... లేకపోతే దండ వత్తగ్గదు....'' అంది అని మన్మథుని బాణంలాటి చూపువిసిరింది.

నిజమే అనిపించి "సరే కట్టు" అన్నాడు. పర్సులోంచి ఇరవై తీసి ఇస్తూ తామరాకులో దండలు పొట్లాం కట్టి ఇచ్చింది. తోవలో పాలకోవా అరకేజీ తీసుకున్నాడు.

"జోరుగా హుషారుగా షికారుపోదమా? హాయిహాయిగా....'' అంటూ ఇంట్లో ప్రవేశించేనరికి ఎదురొచ్చిన శ్రీమతి "ఏంటండోయ్? అంత కులాసాగ ఉన్నారు?" అని అడిగింది.

"కులాసాకాకపోతే ఏంటోయ్! ఏం తెచ్చానో చూడు?" అని పొట్లాం, స్వీట్సు అందించాడు.

"అబ్బో... వెళ్ళినప్పుడు చెప్పటం మరిచిపోయాను. తెస్తారో లేదో అనుకున్నాను. మా మంచి శ్రీవారు" అంది. ఆనందరావు ఆనందతాండవం చేసాడు. గబగబా స్నానం చేసాడు. టిఫిన్ చేసేసాడు. పిల్లలు చదువులకి దూరంగా వెళ్ళిపోయారేమో... ఇల్లంతా ఖాళీగా ఉంది. తొమ్మిదయింది. వార్తలు చూస్తున్నాడు. వార్తలయిపోయాయి. సీరియల్ వస్తోంది. ఛానలు మార్చేసాడు. హెచ్.బి.ఓ పెట్టాడు. ఇద్దరు ముసలి దంపతులు దెబ్బలాడుకుంటున్నారు. ఏ.ఎక్స్.ఎన్ పెట్టాడు. ఏవో ఫైట్సు.... స్టార్ మూవీ పెట్టాడు- అప్పుడే అంటుకుపోయిన రెండు నోర్లు విడిపోతూ కనిపించి ఉసూరుమన్నాడు. ఏ ఛానలు మార్చినా అతనికి కావలసిన మసాలాలేవీ

కనిపించలేదు.

"తెల్లచీర కట్టుకున్న దెవరికోసము. మల్లెపూలు.. సారీ.. సన్నజాజి తురుముకున్న దెవరి కోసమూ...." పాతపాటకి మార్పుచేసి కూనిరాగం తీస్తుండగా.... భార్య గదిలోకి వచ్చింది. తెల్లచీర కట్టుకోలేదు. సన్నజాజులు తురుముకోనూ లేదు.

"ఏంటోయ్.... ఇంకా అలానే ఉన్నావ్? నువ్వేదో రంభలాగ.... స్వప్న సుందరిలాగా వస్తావనుకుంటే.. ఇంకా ఈ డ్రెస్సులోనే ఉన్నావ్?" అన్నాడు.

"చాల్లేండి. ఇంకా రంభా, ఊర్వశుల్లాగా రావటానికి నేనేం ఇరవై, ముప్పయిల్లో లేను. ఏభైకి చేరుకున్నాను." అది చాపతీసిపరుచుకుంటూ,

"అదేంటోయ్... ఆ చాపేంటి? సన్నజాజులేవీ?"

"ఇవాళ శుక్రవారం.. మీరెళ్ళినప్పుడు చెప్పటం మరిచాను. దేనికి అలంకరించటానికి పూలు తెమ్మని. దండలెంత చక్కగా అమరాయో... కోవా దేవికి నైవేద్యం పెట్టాను. రేపందరికీ పంచాలి. పడుకోండి." అని లైటార్పేసరికి అతనితో పొంగే కోరికల మీద ఆమె నీళ్ళు చల్లినట్లయింది.

"లక్ష్మీ! ఇవాళ నేనెంత ఊహించుకున్నానో తెలుసా? ఇది ధర్మం కాదు. ప్లీజ్" మంచం దిగి అనంతలక్ష్మి నడుం మీద చెయ్యేసి బతిమలాడాడు.

"అయ్యో! దూరంగా వెళ్ళండి. నేను దీక్షలో ఉన్నాను. నేను 'అమ్మ' నామాలు చదువుకోవాలి. వెళ్ళి పడుకోండి" అని దూరంగా జరిగింది.

అనంతలక్ష్మి ఆనందరావు ఎంత ప్రాధేయపడినా వినిపించుకోలేదు.

ఆరోజే కాదు -అక్కణ్నించీ ఎంతగా ప్రయత్నించినా - ఎంత బ్రతిమలాడినా ఆమె మాట ఆవెుదే. ఓ రోజు సినామకెళ్దాం రమ్మన్నాడు. నేనింక ఆ హాలుకొచ్చి సినిమాలు చూసే ప్రసక్తి లేదంది. ఎక్కడికి కలిసి వెళ్ళాలి రమ్మన్నా ఒకటే జవాబు. అమ్మ సన్నిధిని విడిచి రానంటోంది. రాను రాను ఇరుగువాళ్ళు, పొరుగువాళ్ళు 'అమ్మ'ని చూడ్డానికి రావటం, కొబ్బరికాయలు కొట్టటం, హారతులివ్వటం, నైవేద్యాలు పెట్టటం 'ఎంత అదృష్టవెుూ చేసుకుంటేగానీ - మీకీ తలంపు రాదు' అని వాళ్ళు అంటుండడంతో అనంతలక్ష్మి భక్తి పరాకాష్ఠకు చేరుకుంది.

ఇక ఇంట్లో ఆనందరావుకీ ఒంటి పూటే భోజనం. ఇంతకముందు శని వారాలే ఉల్లి వండేది కాదు. ఇప్పుడు ఉల్లి పూర్తిగా దూరం చేసింది.

ఆనందరావుకి పిచ్చెక్కిపోయింది.

'దీనికి పరిష్కారం ఆలోచించాలి, అనుకున్నాడు. మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే అమలుచేసేసాడు. ఓ రోజు ఆఫీసుకెళ్తూ "లక్ష్మీ! ఆ హేంగర్స్‌కున్న డ్రెస్సు వాషింగ్ మిషన్‌లో పడేసేయ్. అన్నట్టు... ఎందుకైనా మంచిది... జేబులో కాగితాలేమన్నా ఉంటాయ్... చూడు... వస్తా.. నాకు టైమయిపోయింది." అనుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేసాడు.

భర్త వెళ్ళాక పనులన్నీ ముగించుకుని... మాసిన బట్టలు వాషింగ్ మిషన్‌లో పెట్టింది. స్విచ్ ఆన్ చెయ్యబోతూ భర్త చెప్పిన మాటలు గుర్తొచ్చి అన్ని ఫాంట్లు వెతికింది. నిన్న మార్చిన ఫాంట్లో ఏదో కాగితం తగిలింది. తీసి, టేబిలు మీద పడేసింది. బట్టలన్నీ ఆరేసింది. భోజనం చేసి, 'లలితా సహస్రం' పారాయణ చేస్తుండగా.... ఫాన్ గాలికి టేబులుమీద కాగితం ఎగిరిమీద పడింది. అప్రయత్నంగా తెరిచింది.

"డియర్ ఆనంద్!

నిన్న నువ్వు ఫోన్ చేసావట. సారీ! అమ్మ చెప్పింది. ఎవరే అని చంపిందనుకో, అయినా నీకెన్నిసార్లు చెప్పాను, ఇంటికలా ఫోన్ చేయొద్దని. ఆమెకి సమాధానం చెప్పుకోలేక చచ్చాననుకో. వారం రోజులుగా ఎంత ట్రై చేసినా ఆఫీసులో తీరుబడి లేక.... నిన్ను కలవలేకపోయాను. మొన్ననోసారి మీ ఇంటికి ఫోన్ చేద్దామని అనుకున్నాను. మీ ఇంట్లో మీ 'రాక్షసి' ఎత్తిందనుకో ఫోను. నీ తల మీద కొబ్బరికాయ కొట్టేస్తుంది కదరా! నీ తల పగిలిందనుకో.... దానికేం బాధ లేదు. అది పారాయణ చేసుకుంటూ కూర్చుంటుంది. నా మనసు ముక్కలయిపోదూ? ఏంటిరా వారం రోజులు నీ దగ్గరే నిన్నంటుకుని ఉండిపోవాలనిపిస్తోంది. మా ఇంటికి రమ్మందామంటే మా అమ్మ... మీ ఇంటికి వచ్చేద్దామంటే మీ 'రాక్షసి' ఎక్కడికైనా కొన్నాళ్ళు పోయి గడుపుదామంటే ఆఫీసు దూర్వాసుడు సెలవివ్వడాయె. పోనీ ఒక పని చేస్తా... అబ్బ... ఆశ....దోశ చెప్పను. రేపు సాయంత్రం బీచికి రా. నీకిష్టమైన బ్లూసారీ.... తలనిండా సన్నజాజులు... నీ ఇష్టం. ఈ లెటరిచ్చిన కుర్రాడికి ఓ 'డైరీ మిల్క్' చాక్‌లెట్ కొనివ్వరా.... ఉంటారా.

మరి

ము....ము....ము...నీ

అనసూయ"

పళ్ళు పటపట కొరికింది. "ఏరా.... ఓరే...రాక్షసి!" అంతవరకూ వెళ్ళిందన్న మాట. యాభై ఏళ్ళు వయసొచ్చింది. సిగ్గులేక పోతే సరి." అనుకున్న అలనంతలక్ష్మి మనసు పాడై పోయింది. లలితా సహస్రనామం మీద దృష్టి పోయింది. గుండె కన్నీటితో తడిసి పోయింది. మళ్ళీ ధైర్యం తెచ్చుకుంది. స్నానం చేసింది. దేవిముందు కూర్చుంది. అన్యమనస్కంగానే ధ్యానం మొదలపెట్టింది. అరగంటకి సర్దుకుంది. స్థిమితపడింది.

రాత్రి పదిగంటలకి భర్త ఇంటికొచ్చాడు.

వడ్డించింది. పక్క వేసింది. తన చాప తను తీసుకుంది. ఏవో కబుర్లు చెప్పింది. "అవునూ! బట్టలారేస్ావా? దాన్లో ఓ కాగితం.... ఉండాలి... తీసావా?" అన్నాడు. తడబడుతూ.

"ఆ... అదిగో... ఆ టేబులు మీద పెట్టాను. దానికంత కంగారెందుకు?"

"అయ్యో.... అర్జంటు... ఆఫీసు లెటరు"

"పోనీ, అంత అర్జంటయితే ఎవర్నయినా పంపలేకపోయారా?"

"నువ్వు చూశ్ళేదా?"

"నాకేం పనండీ ఆ కాగితాలతో... ఏం.. ఉతి కానో, ఏం ఆరేశానో నాకు గుర్తా? ఆ 'అమ్మ' చేయిస్తోంది. ఆమె నడిపిస్తున్నట్లు నడవటమే" అని పడుకుండిపోయింది ఏమీ తెలీనట్లే.

'అయ్యో కథ అడ్డం తిరిగిందే! ఇప్పుడెలా?' అని రాత్రల్లా ఆలోచించి ఆలోచించి చేసరికి మరో మెరుపు మెరిసింది. 'ఈ దెబ్బకి ఠా. దేవీ అమ్మా... జాంతానై' అని ఎగిరి గంతేసాడు.

మధ్యాహ్నం పన్నెండున్నర అయేసరికి అనంతలక్ష్మి భోజనం ముగించి ఓ అర్ధగంట నడుం వాలుస్తుంది. సరిగ్గా అది సరియైన సమయం అనుకున్నాడు. చిన్నప్పట్నించి ఆడగొంతు పాటలు పాడటం, ఆడగొంతుకల ననుకరించటం అతనికలవాటు కావటం చేత... సరిగా అదే టైంకి ఫోన్ చేసాడు ఆడగొంతుతో.

"హలో....నేనూ సావిత్రిని మాట్లాడుతు న్నాను." "సావిత్రో..... అనసూయో.... ఇంతకీ నాతో నీకేం పని?"

"మీకు అనసూయ సంగతి తెలుసాండీ?

అదొత్తి మాయలాడి. దాని వల్లో పడి మీ ఆయన నన్ను మోసం చేసాడు. ఆయన మొదటి భార్య పోయిందటగా... మీరు రెండో పెళ్ళాంట గదండీ. మీవల్ల తనికి సుఖం లేకుండాపోయిందని నాతో రోజూ గోల చేసి... నాకు మాయమాటలు చెప్పి... నన్ను వల్లో వేసుకున్నాడండీ. నన్నుపూర్తిగా వాడుకొని... ఇప్పుడు అనసూయం చేయి పట్టుకు తిరుగుతున్నాడు. నిన్ననల్లా బీచ్‌లో.... ఛీ.... నేను చెప్పలేను. అదొత్తి బజారుమనిషి, నేనయితే మీ కాపురానికి హాని కలక్కుండా జాగ్రత్తపడాలనుకున్నాను. అది మంచిది కాదు. మీ జాగ్రత్తలు మీరు తీసుకోండి'' అని అనంతలక్ష్మి 'హలో.... హలో.. అంటున్నా ఫోన్ పెట్టేసాడు.

ఆ తరువాత ఇంటికెళ్ళిన ఆనందరావు మీద అనంతలక్ష్మి నిప్పులు చెరిగింది. "నేను మీకు రెండో పెళ్ళాన్నా? నావల్ల సుఖం లేదా? ఎవర్తా అనసూయ? ఎవర్తా సావిత్రి? ఇంకా ఎంతమందితో కులుకుతున్నారు? చెప్పండి. ఇప్పుడే అమ్మాయికీ, అబ్బాయికీ ఫోన్ చసి.... మీ గుట్టు బయటపెడతాను. మీ అన్నదమ్ముల్ని రప్పించి... అన్ని కథలు కేసెట్టేసి చూపెడతాను'' అని గంతులేసింది.

నిజం చెప్పేద్దామనకున్నాడు. చెప్తే తన పథకం జీవితంలో సక్సెస్ కాదనుకున్నాడు. ఇంకెప్పుడూ ఎక్కడా ఎలాటి తప్పూ చెయ్యనని మాటిచ్చాడు. పిల్లలముందు పరువు తీయొద్దన్నాడు. ఆమె దేవి దగ్గర ప్రమాణం చేయించింది. తను తప్పు చెయ్య లేదు కాబట్టి ధైర్యంగా ప్రమాణం చేసాడు.

అక్కణ్ణించి అనంతలక్ష్మి ఆనందరావుని నాలుగ్గంటలకే లేపి, శీతాకామైనా చన్నీటి స్నానమే చేయమంటోంది. ఉప్పూ, కారాలు కామ ప్రేరకాలని వాటిని పూర్తిగా మానేసింది. పప్పూ, మజ్జిగ, అన్నం, అరటి పండు తప్ప మరేం వండదు. రాత్రి పూట సొజ్జి, మజ్జిగ.

ఆదివారం తప్ప గడ్డం గీసుకోవద్దంది.

వారానికో డ్రస్సే వేసుకోవాలని ఆంక్షలు పెట్టింది. ఓ సారి కోపంతో ఆనందరావు "నేనెక్కడికయినా పారిపోతాను. అప్పుడు తెలుస్తుంది నా విలువ" అన్నాడు. అప్పట్నించీ ఓ ముసలాణ్ణి తోడిచ్చి ఆఫీసుకు పంపటం మొదలుపెట్టింది.

ం ం ం ం

"అదండీ కథ" అన్నాడు కళ్ళనీళ్ళతో.

"అసలు నాకు తెలీకడుగుతాను. ఆ దొంగ ఉత్తరాలు, గొంతు మార్చి ఫోనూ ఎందుకు చేసావ్? నీ ఉద్దేశమేమిటి?'' అన్నాడు.

"నేను పక్కదార్లు పట్టడానికి కారణం తనే అని గ్రహించి... తను మళ్ళీ మారు తుందేమోననుకున్నాను. కానీ నా పథకం పూర్తిగా బెడిసి కొట్టింది. ఇప్పుడు నా సుఖం సంగతలా ఉంచితే.... బతుకే బస్టాండ యిపోయింది. ఎక్కడికయినా పారిపోవాలనిపిస్తోంది'' అని ఆనందరావు అనగానే హెడ్‌గుమాస్తా గతుక్కుమని "అయ్యో! ఆనందూ, పద. బోలెడు పనుంది'' అని చెయ్యి పట్టుకుని లాక్కు పోయాడు ఎక్కడ పారిపోతాడోనని!!